రెండో విడత గొర్రెల పంపిణీకి స్పీకర్‌కు వినతి



స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నేతలు సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో నిలిచిన రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలని కోరుతూ స్పీకర్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెల కాపరులు డీడీ చెల్లించి దాదాపు 18 నెలల కాలం గడుస్తుందన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని గొర్రెల కాపరులు అప్పులు తెచ్చి డీడీలు చెల్లించామన్నారు. గత ప్రభుత్వం కేవలం 35,150 మందికి గొర్రెల యూనిట్లు అందజేసిందని ఇంకా 71850 మందికి వాటి కోసం ఎదురు చూస్తున్నట్లు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పీకర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు డా. కొమ్ము అశోక్‌యాదవ్, ముఖ్య సలహాదారు బేరీ రాంచందర్, ఉపాధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, వివిధ జిల్లాల నాయకులు రాజన్న యాదవ్, చిగుర్ల శ్రీనివాస్, రామాంజి యాదవ్, మల్లేష్ యాదవ్ ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సూచించారు. మేడిబావిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. దాదాపు రూ. 30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డుతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని బస్తీలలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్పొరేటర్ వెంట ఏఈ కౌశిక్, తదితరులు ఉన్నారు.

ఎంపీ టికెట్‌కు దరఖాస్తు



దరఖాస్తు ఫారాన్ని అందజేస్తున్న షబీర్ పాషా

బౌద్ధనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ టికెట్‌ను కేటాయించాలని వారాసీగూడకు చెందిన ప్రభుత్వ ఇస్లామియా హైస్కూల్ ఫర్ బాయ్స్ ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్(రూప్) ఉపాధ్యక్షుడు మహ్మద్ షబీర్ పాషా కోరారు. ఈ సందర్భంగా సోమవారం గాంధీ భవన్‌లో హైదరాబాద్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించానని, పార్లమెంట్ టికెట్ కేటాయిస్తే గెలుపు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్వీ నాయకులు సోమవారం దహనం చేశారు. కేంద్రానికి, చంద్రబాబునాయుడికి తొత్తుగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి కృష్ణ జలాలపై చెప్పేవన్నీ అబద్ధాలేనని బీఆర్ఎస్వీ నాయకులు జంగయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్‌గౌడ్, మిథున్, రామకృష్ణ, నాగేందర్‌రావు, అవినాష్, శ్రీనునాయక్, సంపత్, ప్రశాంత్, నిఖిల్ పాల్గొన్నారు.

కేబినెట్ నిర్ణయం పట్ల హర్షం



వలిగొండ నరసింహ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు కేబినెట్ నిర్ణయం పట్ల తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు, పీహెచ్‌డీ విద్యార్థి వలిగొండ నరసింహ హర్షం వ్యక్తం చేశారు. వాహనాలకు టీఎస్ స్థానంలో టీజీ, జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర అధికార గీతంగా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అమలు కోసం సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో నిర్ణయం తీసుకోవడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను కూడా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

స్వయం ఉపాధితో స్ఫూర్తిగా నిలవాలి



కాఫీ కేంద్రాన్ని ప్రారంభించిన కోట నీలిమ

సనత్‌నగర్: యువత స్వయం ఉపాధిని ఏర్పరచుకుని మరింత మందికి జీవనోపాధిని కల్పించే స్థాయికి ఎదగాలని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బల్కంపేట రిలయన్స్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన కోయిం బత్తూర్ ఫిల్టర్ కాఫీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. నేటి యువత భవిష్యత్ తరానికి స్ఫూర్తిగా నిలిచేలా వ్యాపార రంగంలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో యల్లావుల చక్రధర్‌యాదవ్, కంజర్ల సదాశివయాదవ్, గంగాధర్‌గుప్తా, మహేశ్వర్, అనూష, గోపి గోలి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన బీజేపీ శ్రేణులు



సనత్‌నగర్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి ప్రత్యేక రైలులో అయోధ్యకు బయలుదేరారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి 1400 మందితో బయలుదేరిన రైలులో ఎస్ఆర్‌నగర్ బాపునగర్ నుంచి బీజేపీ నేతలు సోమ్లా సాయిరామ్, నాగరాజ్‌సింగ్, హేమంత్‌నాయక్, సాయి అఖిలేష్, రితేష్, లఖన్, పరమేష్ తదితరులు అయోధ్యకు వెళ్లారు.

ప్రజావాణికి 3 దరఖాస్తులు



ప్రజావాణిలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ శంకర్

సనత్‌నగర్: బేగంపేట సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు అందాయి. బేగంపేట ప్రకాష్‌నగర్‌లో అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నారంటూ స్థానికంగా ఓ మహిళ ఫిర్యాదు చేసింది. రెజిమెంటల్‌బజార్‌కు చెందిన దామోదర్‌చారి తనకు రెట్టింపు స్థాయిలో ప్రాపర్టీ ట్యాక్స్ విధించారంటూ ప్రజావాణిలో బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ శంకర్ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా బోయిగూడలో సెంట్రల్ వ్యూ అపార్ట్‌మెంట్ వెనుక అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ స్థానికంగా ఉండే ఒకరు ఫిర్యాదు చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఉప కమిషనర్ శంకర్ తెలిపారు.

మోడల్‌కాలనీ పోలింగ్ బూత్‌లను మార్చాలి..

మోడల్‌కాలనీలో ఉండే ఓటర్లు సుదూర ప్రాంతంలో ఉన్న పోలింగ్ బూత్ నెంబర్లు 194, 195లకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారంటూ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కమిషనర్ రొనాల్డ్‌రాస్ దృష్టికి తీసుకొచ్చారు. తమ కాలనీలో ఓటర్లు సమీపంలో ఉండే 197 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. 194 బూత్‌లో 155 మంది ఓటర్లు, 195 బూత్‌లో 11 మంది ఓటర్లు ఉన్నారని, వీరి కుటుంబాలు దూరంలో ఉండే పోలింగ్‌బూత్‌లకు వెళ్లాల్సి రావడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మోడల్‌కాలనీ కాలనీ ఓటర్లందరినీ ఒకే బూత్ (197) పరిధి కిందికి తీసుకురావాలని కోరారు.

డే కేర్ సెంటర్లపై దృష్టి పెట్టండి..

సీనియర్ సిటిజన్స్ కోసం నిర్వహిస్తున్న డేకేర్ సెంటర్లలో ఎలక్ట్రానిక్ ట్రెడ్ మిల్‌ను సమకూర్చాలన్నారు. ఐదేళ్ల క్రితం ఇచ్చిన క్యారమ్స్, ఇతరత్రా ఆట సామగ్రి పాడైపోయాయని, కొత్తవాటిని సమకూర్చాలని కోరారు. డేకేర్ నిర్వహణకు ఇచ్చే పారితోషికం సరిపోవడం లేదని, ప్రస్తుతం ఉన్న పారితోషికాన్ని మరింతగా పెంచాలన్నారు. వీటితో పాటు పలు వసతులు కల్పించాలని ఆయన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



సీవరేజీ పనులను పరిశీలిస్తున్న ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం శాంతినగర్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న సీవరేజీ పైప్‌లైన్ పనులను అధికారులు, పార్టీ నేతలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ ఏఈ వేణు, జలమండలి ఏఈ కృష్ణప్రసాద్, నేతలు శ్రీనివాస్‌గౌడ్, హాషం, కుమార్ వంశి, అమర్, హన్మంత్, రవి, ఇస్మాయిల్, గోపి, ప్రవీణ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డ్రై ఫ్రూట్స్‌తో ఆరోగ్యానికి ఎంతోమేలు



చిలకలగూడ : డ్రై ఫ్రూట్స్‌తో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని శాస్త్రీయంగా రుజువైందని, క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ తగిన మోతాదులో డ్రైఫ్రూట్స్ తింటే అనారోగ్యం దరిచేరదని అమరావతి టాలెంట్ స్కూలు ప్రిన్సిపాల్ ప్రశాంత్ రెడ్డి అన్నారు. నామాలగుండు అమరావతి టాలెంట్ స్కూలులో సోమవారం డ్రైఫ్రూట్స్ ఫెస్టివల్ వేడుకలను సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైఫ్రూట్స్‌లో శరీరానికి కావాల్సిన విటమిన్ క్యాల్షియం, కాపర్, మెగ్నీషియం, రైబోఫ్లేవిన్, ఐరన్, పొటాషియం, జింక్ తదితర పోషకాలు సమృద్ధిగా లభిస్తాయన్నారు. ప్యాటీ, యాంటీ ఆక్సిడెంట్లు ప్యాంక్రియాటిక్, బెస్ట్ కేన్సర్, డయాబిటిస్, కిడ్నీ సమస్యలతోపాటు జీర్ణ వ్యవస్థను మెరుగు పరుస్తుందన్నారు. డ్రైఫ్రూట్స్‌తో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. డ్రైఫ్రూట్స్ బొమ్మల వేషధారణలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మంగళమేడం, అధ్యాపకులు మల్లేష్, గణేష్, జానకీ, నళిన్‌కుమార్, సుధార, అజయ్, హజీర, రూప, లలిత, అషియా, షీబు, సబినా పాల్గొన్నారు.

సాయన్న జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు



సమావేశమైన బీఆర్ఎస్ నాయకులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న మొదటి వర్ధంతి పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం రెండవ వార్డు బస్తీల్లో కాలనీల్లో 19వ తేదీ వరకు శ్రద్ధాంజలి ఘటించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. సోమవారం ముదిరాజ్ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు షేక్ నయిం, గణేష్ టెంపుల్ కమిటీ మాజీ సభ్యులు అంజనేయులు, పెరుమాళ్ టెంపుల్ కమిటీ ట్రస్ట్ మాజీ సభ్యులు నరేష్, శ్రీనివాస్ మాట్లాడారు. ఈ నెల 19న సాయన్న మొదటి వర్ధంతి కార్యక్రమం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఐదుసార్లు కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా సాయన్న చేసిన సేవలను ప్రజలకు వివరిస్తూ నేటి నుంచి ప్రతి రోజు బస్తీల్లో కాలనీల్లో సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ సంతాపం తెలుపుతూ వివిధ కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జిలానీ, రఘురామన్, ధన్‌రాజ్, బాల్‌రాజు, గఫర్, సలీం, షాహిద్, బాషా, ముజిబ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

జ్యోతి హంతకులను శిక్షించాలి

- చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్న అత్తింటివారు
- న్యాయం చేయాలని మృతురాలి తల్లిదండ్రుల డిమాండ్

రహమత్‌నగర్: తన కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని ఆమెను అత్తింటివారే మానసికంగా వేధింపులకు గురిచేసి చంపేశారని మృతురాలి తల్లిదండ్రులు వెంకటస్వామి, లలిత ఆరోపించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వారు మాట్లాడారు. తన కూతురు జ్యోతి(32)కి తన అన్న బాలరాజు కుమారుడు విజయ్‌కి ఇచ్చి వివాహం చేశామని వారిని ఇద్దరు మగ పిల్లలు ఉండేవారని తెలిపారు. తన కూతురు కష్ట పడి చదివి టీచర్ ఉద్యోగం సాధించిందని వివరించారు. తాను ఎస్ఎస్‌బీనగర్‌లో టీచర్‌గా పనిచేసేదన్నారు. అయితే భర్త అత్తమామలు ఉద్యోగం పేరుతో కోటి రూపాయలు లోను తేవాలని తన కూతురును వేధించారని వారు వాపోయారు. ఈ క్రమంలో గత ఏడాది ఆగస్టు 13 రాత్రి జ్యోతి తన పిల్లలను విషం ఇచ్చి తాను ఆత్మహత్య చేసుకుందని తమకు సమాచారం అందించారని తెలిపారు. తాము దిగ్భ్రాంతిలో ఉండగా పోస్టుమార్టం కోసమని తమతో సంతకాలు తీసుకుని అవే ఫిర్యాదు కాగితాలుగా మార్చి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపి జ్యోతిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తాము డీజీపీ, ఏసీపీలతో పాటు ఇతర అధికారులు కోరుతూనే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఉద్యమకారులకిచ్చిన హామీలు నెరవేర్చాలి



యాదగిరి

బౌద్ధనగర్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గుండా యాదగిరి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైనప్పటి నుంచి తెలంగాణ సిద్ధించేంత వరకు తెలంగాణ ప్రాంతీయ ఉద్య సమితీ(టీపీయూఎస్) తొలి దశ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమ గమనంలో భాగమైందని తెలిపారు. ఎన్నో ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా తెలంగాణ కోసం ఏ సంస్థ, ఉద్యమ నాయకుడు, ఎవ్వరు పిలుపునిచ్చినా దాన్ని సొంత కార్యక్రమంగా భావించి ఉద్యమాల్లో పాల్గొన్నామని వివరించారు. అలాంటి ఉద్యమ గొంతులను గుర్తించి ఉద్యమకారులను ఆదుకునేలా ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 250 గజాల స్థలం, పెన్షన్, బస్‌పాస్, ఆర్థికసాయం, జీవనోపాధికి సంబంధించి ఐడీ కార్డులు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అసువులు బాసిన అమరుల త్యాగాలను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించండి



కేక్‌కట్ చేస్తున్న సీపీఐ నేత డి.రాజా

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించాలని ఓయూ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ (జేఆర్) ఉప్పరి ఎల్లేష్ సీపీఐ జాతీయ నాయకులను కోరారు. సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు నగరానికి విచ్చేసిన జాతీయ నాయకులు డి.రాజా, నారాయణకు పుష్పగుచ్ఛాలను అందజేసి సన్మానించి కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు.

'కేఎల్ఎన్‌వై పార్కులో మందుబాబుల తిష్ట'

అమీర్‌పేట: సనత్‌నగర్‌లోని కేఎల్ఎన్‌వై పార్కు పరిసరాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి.సాయంత్రం అయ్యిందంటే చాలు మందుబాబులు, గంజాయి గ్యాంగ్ తిష్టవేసి వీరంగం సృష్టిస్తున్నారని పార్కుకు వచ్చే సందర్శకులు, సమీపంలోని కాలనీ వాసులు వాపోతున్నారు.వాకర్స్ తమ వాహనాలను పార్కింగ్ చేసేందుకు ఉన్న స్థలంలో మందుబాబులు తిష్ట వేస్తున్నారు.గేట్లకు తాళాలు వేసినా దూకి మరీ లోపలికి వెళ్తున్నారు. అర్ధరాత్రి వరకు లోపలే ఉండి హంగామా సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మత్తులో పార్కు లోపలకు వస్తున్న కొందరు మరుగుదొడ్లు, మూత్రశాల నల్లాలను సైతం ధ్వంసం చేస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే ఎదురు దాడులకు దిగుతున్నారని వాపోతున్నారు. పోలీస్ పెట్రోలింగ్ కూడా లేకపోవడంతో వీరి ఆగడాలకు హద్దే లేదని పోలీసు అధికారులు స్పందించి పార్కు వైపు నిఘా ఉంచాలని కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే తలసాని పర్యటన

సనత్‌నగర్: నియోజకవర్గంలోని సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో మంగళవారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు అమీర్‌పేట డివిజన్ గాయత్రీనగర్‌లో నాలా అభివృద్ధి పనులు పరిశీలించనున్నారు. అనంతరం 10 గంటలకు బీకేగూడ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

లాలాగూడ ఎస్‌హెచ్‌ఓగా పల్లె పద్మ



అడ్డగుట్ట: లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పల్లె పద్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ పల్లె పద్మ ఇది వరకు మారేడుపల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా, సుల్తాన్ బజార్ ఇన్‌స్పెక్టర్‌గా అదే విధంగా సీసీఎస్‌లో విధులు నిర్వహించారు. అంతకు ముందు లాలాగూడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన మధులత సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ.. నేరాలకు పాల్పడితే ఎంతటివారైనా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతియుత వాతావరణం నెలకొనేలా నేరాల నియంత్రణకు కృషి చేస్తానని ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు.

పేకాట రాయుళ్లపై కేసు

అడ్డగుట్ట: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దయాకర్ తెలిపిన వివరాల ప్రకారం. అడ్డగుట్ట, తుకారాంగేట్, మల్కాజ్‌గిరి ప్రాంతాలకు చెందిన పది మంది ఆదివారం తుకారాంగేట్ నందనార్ నగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న తుకారాంగేట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై దాడిచేసి పది మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 15 వేల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ సమీపంలోని తుకారాంగేట్ డౌన్ లైన్ పట్టాల వద్ద సుమారు 45-50 సంవత్సరాల మధ్య వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చెక్స్ షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు.

డీవైఎఫ్ఐ నగర సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా హష్మీబాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డీవైఎఫ్ఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడిగా హష్మీబాబును జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆమోదంతో ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, మహేందర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా హష్మీబాబుకు నియామకపత్రాన్ని అందజేసి అభినందించారు. నగరంలో స్థానిక సమస్యలు విద్య, వైద్యం, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాటాలు చేపడతామన్నారు. అనిల్, ప్రవీణ్, దేవేందర్‌లను ఆఫీస్ బెరర్లుగా, మహేష్‌ను జిల్లా కమిటీకి ఎన్నుకున్నారు.

రైల్లో బంగారం, నగదు అపహరణ

కాచిగూడ: జైపూర్ రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి బ్యాగులోంచి బంగారు ఆభరణాలు, నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్‌లోని గంపూరి ప్రాంతానికి చెందిన కాశీప్రసాద్ సోని కుమార్తె నకుల్ సోని (52) జైపూర్ రైల్లో కాచిగూడకు వస్తుండగా.. మార్గం మధ్య మందకడ్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.40,500 నగదు, 1 గ్రాము బంగారు ఆభరణం, ఖరీదైన సెల్‌ఫక్షన్ కలిగిన బ్యాగును దొంగిలించారు. సోమవారం బాధితులు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేశామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ బీజీ ప్రసాదరావు తెలిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు మెడికల్ టెస్ట్

- మొదటి రోజు 79 మందికి మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు
- ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

నల్లకుంట: గత ఏడాది నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఆరోగ్య పరీక్షల (మెడికల్ ఫిట్‌నెస్) క్యాంప్ ప్రారంభమైంది. ఈ క్యాంపు 5 రోజుల పాటు కొనసాగనుంది. కాగా కొత్తగా ఇటీవల ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు నగరంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారని సమాచారం.

- సుమారు 800 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించేందుకు ఫీవర్ ఆస్పత్రికి అనుమతి ఇచ్చారు. ఈ పరీక్షలను ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, హెచ్‌ఓడీ డాక్టర్ కె. శంకర్, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జయలక్ష్మితో పాటు ఓయూ ఏసీపీ సైదులు, నల్లకుంట సీఐ జగదీశ్వర్‌రావు పర్యవేక్షణలో నిర్వహించారు.
- ఈస్ట్‌జోన్ డీసీపీ సాయిశ్రీ ఈ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని వైద్యులకు సూచించారు. కాగా మొదటి రోజు 79 మంది అభ్యర్థులు మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరైనట్లు సమాచారం.
- మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. ఆరు నెలల క్రితం పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్షలో అర్హత సాధించి ఉద్యోగాలకు ఎంపికైన సుమారు 27 వేల మంది అభ్యర్థుల్లో సుమారు 800 మందికి మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలు వచ్చాయని చెప్పారు. ఈ మేరకు సోమవారం మెడికల్ పరీక్షలు ప్రారంభించామన్నారు. అభ్యర్థులకు ఐదు రోజుల్లో వైద్య పరీక్షలు పూర్తిచేసి రిపోర్టులను పోలీసు ఉన్నతాధికారులకు (డీసీపీ లేదా ఏసీపీ) అందజేస్తామని తెలిపారు.
- వైద్య పరీక్షల కోసం నాలుగు వైద్య బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో ఒక వైద్యుడు, ముగ్గురు సహాయకులు ఉంటారని వివరించారు. అభ్యర్థుల ఆరోగ్య, వైద్యపరీక్షలకు సంబంధించిన రిపోర్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పొద్దని వైద్యులకు సూచించామని చెప్పారు.
- కంటి పరీక్షల్లో అభ్యర్థుల్లో ఎవరికైనా కలర్ విజన్, గ్లాకోమా, దృష్టి లోపం లాంటి సమస్యలు ఉన్నట్టు గుర్తిస్తే, అలాంటి అభ్యర్థులను ఆధునిక పరీక్షల కోసం సరోజిని దేవి కంటి ఆస్పత్రికి రెఫర్ చేస్తామని వివరించారు.
- బీపీ, షుగర్, ఈసీజీ, బ్లడ్, ఎక్స్ రే లాంటి పరీక్షలు తమ ఆస్పత్రిలో ఉన్న ఆధునిక పరికరాలతోనే పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో అవకతవకలకు తావు తేకుండా పోలీసు అధికారుల సమక్షంలోనే పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ పరీక్షల కోసం వచ్చిన అభ్యర్థులకు తాగునీరు లాంటి వసతులను ఏర్పాటు చేశారు.